క్లుప్తంగా

చురుగ్గా అంతర్గత రహదారుల పనులు



ఎస్సీ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులు

ఉయ్యాలవాడ : స్థానిక ఎస్సీ కాలనీలో ఎంపీ ల్యాండ్స్‌తో చేపట్టిన అంతర్గత రహదారుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. శుక్రవారం పంచాయతీ రాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అంతర్గత రహదారుల ఏర్పాటుకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి రూ. 8.80 లక్షలు కేటాయించడంతో నిర్మాణ పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

నిందితులను శిక్షించాలి

నంద్యాల(అర్బన్): మండలంలోని పులిమద్ది గ్రామ రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌రెడ్డిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ విధులకు వెళ్తుండగా దారి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ సంఘటనపై జిల్లా పోలీసు అధికారులకు విన్నవించామన్నారు. నిందితులను పట్టుకొని శిక్షించాలని, దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, అసోసియేట్ ప్రెసిడెంట్ గిరిశంకర్‌రెడ్డి, సునిల్‌కుమార్, వెంకటరమేష్, గౌస్ పాల్గొన్నారు.

హజ్ హౌస్‌ను తెరిపించాలి

నంద్యాల(అర్బన్): మక్కాకు వెళ్లే ముస్లింల కోసం వైఎస్సార్ కడప జిల్లాలో నిర్మించిన హజ్ హౌస్‌ను తెరిపించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యూనిస్ కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. నిర్వహణ కమిటీ నిర్లక్ష్యంతో హజ్ హౌస్ తెరుచుకోలేక పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మక్కా యాత్రకు వెళ్లే ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఇళ్ల నిర్మాణ వ్యయం పెంచాలి

నంద్యాల(అర్బన్): జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణ వ్యయాన్ని రూ.1.8లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నిర్మాణ వ్యయాన్ని పెంచాలంటూ ఫిబ్రవరి 22న విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, నిర్మాణ వ్యయానికి సంబంధించి జనవరి 17 నుండి 30వ తేదీ వరకు సంతకాల సేకరణ, 30 రౌండ్‌టేబుల్ సమావేశం, ఫిబ్రవరి 6న కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన, 22న విజయవాడలో మహాధర్నా ఉంటుందని వివరించారు. నాయకులు రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, మోటా రాముడు, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 4వ వార్డు కౌన్సిలర్ తబ్రేజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి కానుకల పంపిణీని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకున్న దాంట్లో సామాజిక సేవ చేయాలనుకోవడం అభినందనీయమన్నారు. మొత్తం 125మందికి కానుక కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా, కౌన్సిలర్ అబ్దుల్‌సమ్మద్, కోఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు లగిసెట్టి సుబ్బ గురుమూర్తి, నాయకులు సముద్రాల కుమార్, నాగపుల్లయ్య, రామయ్య, కృష్ణమూర్తి, విజయ, బిందుమల్ల శ్యాం, కటకం శశి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దాదాపు 40 జట్లు పాల్గొన్న పోటీలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ప్రదీప్‌రెడ్డి, సీపీఎం నాయకుడు రమేష్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. వాటితో పాటు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో యువతను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. నాయకులు క్రాంతికుమార్, నాగరాజు, నరసింహ, సందీప్, లక్ష్మణ్, నిరంజన్, కిరణ్ పాల్గొన్నారు.

మార్పు మంచిదే..

- ఫలించిన పంట మార్పిడి
- వరి, పత్తికి బదులుగా జొన్న, మిరప సాగు
- ఆశాజనకంగా దిగుబడులు, ధర
- ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అన్నదాతల అడుగులు

నియోజకవర్గంలో సాగుచేసిన మిరప, జొన్న పంటల వివరాలు (ఎకరాల్లో)

మండలం	మిరప	జొన్న
ఆళ్లగడ్డ	721	1,450
చాగలమర్రి	245	950
దొర్నిపాడు	1,657	3,509
రుద్రవరం	259	553
శిరివెళ్ల	605	145
ఉయ్యాలవాడ	1,150	155
మొత్తం	4,637	6,762



దొర్నిపాడు వద్ద విరగ్గాసిన జొన్న పంట

దొర్నిపాడు: ఏళ్లుగా ఒకే రకమైన పంట సాగు చేసి దిగుబడులు రాక ధర లభించక రైతన్నలు ఆర్థికంగా చితికిపోయారు. ప్రతి సంవత్సరం వరి, పత్తి సాగుచేస్తున్నారు ఈ ప్రాంత రైతులు. సాధారణంగానే దిగుబడులు పడిపోతూ వస్తున్నాయి. మరో వైపు పెట్టుబడి మాత్రం పెరుగుతోంది. ఇంకో వైపు పంటలకు తెగుళ్ల అదుపులోకి రాకపోవడంతో మందుల వినియోగం భారీగా పెరిగిపోయింది. పెట్టుబడికి తగ్గట్లుగా కూడా దిగుబడి రాకపోతుండటంతో వారిలో ఆందోళన మొదలైంది. మరికొందరు చొరవ చూపి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ప్రారంభించారు. వాతావరణంతో పాటు పుడమి తల్లి సహకరించడంతో దిగుబడి ఆశాజనకంగా ఉండటం, ధర ఊహించిన దానికన్నా ఎక్కువగా లభిస్తుండటంతో లాభాలు చూస్తున్నారు.

పెరిగిన జొన్న, మిరప సాగు..

వరి పంటకు ప్రత్యామ్నాయంగా మిరప, జొన్న పంటలను సాగుచేశారు రైతులు. అయితే వారికి ఈ పంటల సాగు కలిసి రావడంతో సంతోషం వ్యక్తమవుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మిరప 3,637, జొన్న 6,762 ఎకరాల్లో సాగు చేశారు. దొర్నిపాడు మండలంలో మిరప 1,657, జొన్న 3,509 ఎకరాల్లో అత్యధికంగా సాగవడం చూస్తే రైతుల్లో మార్పు మొదలైందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో కేసీ కెనాల్ కింద ఏటా రైతులు వరి పంటను 2,679 ఎకరాల్లో సాగుచేసేవారు. ఈసారి వరి సాగు యాభై శాతం తగ్గింది. దాని స్థానంలో మిరప, జొన్న వేశారు.

రైతుల పాలిట ఎర్ర బంగారం..

మిరపను రైతులు ఎర్రబంగారంగా అభివర్ణిస్తారు. ఈ ఏడాది మాత్రం వారి పోలిక నిజమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి ధర క్వింటా రూ.30 వేల నుంచి రూ.37 వేల వరకు ఉంది. తొలి కోతలోనే ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగబడులు వస్తున్నాయి. పంట సాగుకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వెచ్చించారు. పెట్టుబడులు పోనూ సగటున రూ.5 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశముంది. అలాగే జొన్న పంట కూడా ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం జొన్న క్వింటా ధర రూ.3,100 వరకు ఉంది. ఎకరాలో పంట సాగుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వస్తుంది. అన్నీ పోనూ రైతన్నకు రూ. 40వేల వరకు మిగులుతుంది. ప్రస్తుతం మిరప, జొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.



చాకరాజువేముల పొలాల్లో ఆరబోసిన మిరప దిగుబడి

20 ఎకరాల్లో మిరప సాగు చేశా



20 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. వరి, పత్తి పంటలు వేసి ఇప్పటి వరకు నష్టాలను చవిచూశా. ఈ సారి మిరప పంట లాభదాయకంగా ఉంది. ఎకరాకు 20 క్వింటాకు పైగా దిగుబడులు వచ్చేలా పంట ఉంది. ధర కూడా గిట్టుబాటవుతుండటంతో రైతులు కష్టాల నుంచి బయట పడే అవకాశం ఉంది. ప్రస్తుతం మొదటి కోత బాగానే వచ్చింది.

– కృష్ణారెడ్డి, మిరప రైతు, దబ్ల్యూ.గోవిందిన్నె

వరిని వదిలి జొన్న పంట వేశా



నాకు కేసీ కెనాల్ కింద పొలం ఉంది. ఎప్పుడు వరి పంట సాగు చేసేవాడిని. మూడేళ్లుగా వరి సాగుకు పెట్టుబడులు అధికమవుతున్నాయి. అలాగే దిగబడులు తగ్గాయి. దీంతో నష్టాలు వస్తున్నాయి. ప్రత్యామ్నాయంగా 8 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశా. పెట్టుబడి తక్కువగా ఉండటం, నిర్వహణ ఖర్చు లేకపోవడం, శ్రమ తక్కువగా ఉండటంతో పాటు దిగుబడి ఎకరాకు 20 బస్తాల వరకు వస్తున్నాయి. పంట మార్పిడితో ఇబ్బందుల నుంచి గట్టెక్కాను.

– దయానందరావు, జొన్న రైతు, రామచంద్రాపురం

పంట మార్పిడి మంచిది



రైతులు ఎప్పుడూ ఒకే పంట వేయడం వల్ల నేల స్వభావం దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గడం, తెగుళ్లు పెరుగుతాయి. మందుల అధిక వినియోగంతో భూమి నిస్సారమవుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే రైతులకు నష్టం అనే మాట ఉండదు. ఏది ఏమైనా ఈ ప్రాంత రైతులు పంటి మార్పిడికి పూనుకోవడం శుభపరిణామం. రైతులంతా ఈ దిశగా అడుగులు వేస్తే బాగుంటుంది.

–శ్రీకృష్ణ, ఏఓ, దొర్నిపాడు

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

రుద్రవరం: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించేలా చూడాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్ణీత సమయానికి సచివాలయానికి చేరుకొని హాజరు వేసేలా చూడాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల గౌరవంగా మెలగాలని చెప్పారు. అలాగే పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ భాగ్యలక్ష్మి, ఏఓ వరలక్ష్మి, గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న గణపతి సచ్చిదానంద, ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ఎస్వీ నాగిరెడ్డి స్మారక గిరిజన సంక్షేమ పాఠశాల నిర్మాణానికి దత్త అవదంబర నారసింహ క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామితో కలిసి విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. 15 ఏళ్ల క్రితం ఆళ్లగడ్డ మాజీ సర్పంచ్ దివంగత ఎస్వీ నాగిరెడ్డి అహోబిలంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమానికి 2.20 ఎకరాలు కానుకగా ఇచ్చారు. దీంతో శుక్రవారం గణపతి సచ్చిదానంద పీఠం వారు ఆ స్థలంలో గిరిజన సంక్షేమ పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. మాజీ సర్పంచ్ సోముల శివమ్మ, ఎస్వీ లక్ష్మిరెడ్డి, ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ. 80 కోట్ల రుణాలు

శిరివెళ్ల: ఆళ్లగడ్డ క్లస్టర్‌లో రూ.80 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ చేశామని వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ దానం తెలిపారు. శుక్రవారం క్లస్టర్ పరిధిలోని సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.110 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యమని, మార్చిలోపు వంద శాతం పంపిణీ జరగాలని సూచించారు. అలాగే బకాయిల వసూళ్లు, స్త్రీనిధి, ఉన్నతి రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్లస్టర్ పరిధిలో 5,500 డ్వాక్రా సంఘాలు ఉండంగా ఇంత వరకు 2,500 సంఘాల ఆడిట్ పూర్తియిందని చెప్పారు. ఏపీఎం పుణ్యవతి, సీసీలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రభావతి ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డు హెల్త్ సెక్రటరీలతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రజలకు సుస్థిర ఆరోగ్యా లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, ఎన్‌సీడీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతరావు, నేషనల్ హెల్త్ మిషన్ డీపీఎం నజీమున్, స్టాటస్టికల్ ఆఫీసర్ సుజాత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో నిర్బంధంగా ఉన్నత పాఠశాలలకు పంపడం అన్యాయమని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీలు జరిగే లోపు పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన వారికి జిల్లా యూనిట్‌గా తీసుకొని మ్యానువల్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులతో విల్లింగ్, అన్ విల్లింగ్ తీసుకోకుండా సర్దుబాటు పేరుతో కేవలం రూ.2,500 ఇచ్చి ఉన్నత పాఠశాలలకు పంపించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా



24వ వార్డులో వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: సంక్షేమ ఫలాలతో పేదలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో కౌన్సిలర్ షహనాజ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు మీకు సక్రమంగా అందుతున్నాయా? మీ వలంటీర్ సేవలు బాగా అందిస్తున్నారా? అధికారుల పని తీరు ఎలా ఉంది? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, పథకాల అమలుతీరు, సమస్యలను పరిష్కరించేందుకే ఇంటింటికీ తిరుగుతున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక ఉన్నతి సాధించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మహిళలు, రైతులు, చిరు వ్యాపారులు తదితర అన్ని వర్గాల ప్రజలకు ఏదో రూపంలో అండగా నిలుస్తున్నారని, ఇలా ఇంతకుముందెన్నడూ జరగలేదని తెలిపారు. పథకాలు, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో వారి నుంచి అపూర్వ స్వాగతం, అదరణ లభిస్తోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తున్నామని, ఇంకా ఎవరైనా అర్హులుంటే సమీపం సచివాలయంలో సంప్రదించి ధ్రువ పత్రాలు అందజేస్తే అధికారులు విచారణ చేసి లబ్ధి చేకూరేలా చర్యలు చేపడతారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నపై మీ ప్రేమ కొనసాగాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ పాంషావలి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా, నాయకులు శ్రీనివాసులు, కబీర్, కలాం, అన్వర్, మాధవి, వెంకటలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కర్ణాటక ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



కర్ణాటక ముఖ్యమంత్రి బొమ్మైకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలంలో నిర్వహిస్తున్న రాష్ట్రీయ ధర్మజాగృతి మహా సమ్మేళనానికి కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప శుక్రవారం హాజరయ్యారు. బెంగళూరు నుంచి విమానంలో కర్నూలు ఓర్వకల్లు విమాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12:45 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. వీరి వెంట ఆ రాష్ట్ర కేబినెట్ మంత్రులు గోవింద్ కర్జోల్, మురుగేస్ నిర్దాని ఉన్నారు. వీరికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్రీయ ధర్మజాగృతి మహా సమ్మేళన ప్రతినిధులు జగదీష్, గురురాజ్ చారంతిమత్, హర్షగుట్టేదార్, కౌసిక్, బసయ్య మహాలింగపురమత్, ప్రశాంతి దుగ్గతీమత్ ఉన్నారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప తదితరులు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన శ్రీశైలం చేరుకున్నారు. పలు అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం 5:30 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు.

గిరిజన గూడేల్లో ఉపాధి పనులు

బండిఆత్మకూరు: గిరిజన గూడేల్లో గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం నాయిని చెరువు చెంచు గూడెం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో గిరిజనులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉపాధి పనులు జరిగేవని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏలో కాకుండా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీఓలు వసుధ, నాగార్జున పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధా రాణి

ఆళ్లగడ్డ: వచ్చే నెల 11వ తేదీన స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి రాధా రాణి సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీస్, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. రానున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. సివిల్, క్రిమినల్ తగాదాలకు సంబంధించి రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మురళీధర్, ఏపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఏజీపీ షడ్రక్ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు స్వల్ప ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం స్వల్ప ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పైనుంచి 1,050 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, కేసీ కాల్వకు 817 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. డ్యామ్‌లో 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కాగా.. దిగువకు నీటి విడుదలను నిలిపేశామని చెప్పారు.

ఆర్‌బీకేల సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఏఓ మోహన్‌రావు

ఆళ్లగడ్డ: రైతులు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వెంటనే పంట నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ రాని రైతులు ఈ–కేవైసీ చేయించుకొని ఆధార్ కార్డుకు తప్పని సరిగా మొబైల్ నంబర్ లింక్ చేసుకోవాలని చెప్పారు. ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులోఉన్నాయని రైతులు పంటలకు అనుగుణంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యాలవాడ : సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. ఈ నెల 15వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయించుకోవాలన్నారు. మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాల పరిధిలో పప్పుశనగ, మినుము, పెసర, పొగాకు, సోయాబీన్, మొక్కజొన్న, తదితర పంటలు రబీలో భాగంగా 32 వేల ఎకరాల్లో సాగయ్యాయని, ఇప్పటి వరకు 12 వేల ఎకరాల్లో మాత్రమే ఈ క్రాప్ నమోదు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పూర్తి చేశారని వివరించారు. పశు వైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెంచాలి

దొర్నిపాడు: మండలంలో చిరుధాన్యాల సాగు పెంచాలని వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలంలో ఈసారి 120 హెక్టార్లలో కొర్ర సాగే చేశారని, వరి, పత్తి, మిరపకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు శ్రీకారం చుట్టాలని తెలిపారు.రసాయన మందు పిచికారీలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద గుండుపాపల, దొర్నిపాడు, కొండాపురం గ్రామాలకు డ్రోన్ మంజూరైందని చెప్పారు. పంట యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ వంటి విషయాలను మాసపత్రిక ద్వారా తెలుసుకోవచ్చాన్నారు. రూ.300 చెల్లించి ప్రతి రైతు తీసుకోవాలని కోరారు. అలాగే రబీలో సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు, ఈ– కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. నానో యూరియా కావలసిన రైతులు సచివాలయంలో సంప్రదించాలన్నారు. పశువైద్యాధికారి హరిత మాట్లాడుతూ నట్టల నివారణకు రైతులు పశువులకు వ్యాక్సినేషన్ చేయించాలని తెలిపారు.

రైతులకు మేలు జరిగేలా చూడండి

రుద్రవరం: మండలంలోని రైతులందరికీ మేలు జరిగేలా చూడాలని వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ రబీలో భాగంగా సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ– క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా నమోదు చేయించాలని కోరారు. అలాగే పీఎం కిసాన్ అందని రైతులు వెంటనే ఈ–కేవైసీ చేయాలని చెప్పారు.సమీకృత రైతు సమాచారం కేంద్రం వంటి అంశాలను వివరించారు మండలి అధ్యక్షులు ఎర్రం నర్సిరెడ్డి, సభ్యులు మాట్లాడుతూ రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ యాంత్రీకరణ, టార్పాలిన్ పట్టలు, జింక్, జిప్సం వంటివి రాయితీ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశం దృష్టికి తెచ్చారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ శామూన్, చిత్రంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 20వ తేదీన పాణ్యం మండలం నెరవాడకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీశైల దేవస్థానంలోని సీసీ కంట్రోల్ రూంలోని సమావేశ మందిరంలో పర్యటన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఈ నెల 20న పాణ్యం మండలం నెరవాడ గ్రామంలో గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. గిరిజనుల జీవనశైలి, అభివృద్ధి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి సమీక్షిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన సివిల్ పనులు, అప్రోచ్ రోడ్డు, భూమి చదును, షామియానా, లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ వివరాలు తదితర ఏర్పాటన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. నెరవాడ గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ట్రైబల్ స్కూల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.